క్లుప్తంగా

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి


పోస్టర్ విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీదేవి ఆలయం వద్ద భారత నిర్మాణ సేవా ట్రస్ట్ నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను శుక్రవారం దేవరాపల్లి మండలం తారువలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అధిక సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బుచ్చెయ్యపేట ఎంఈవోగా బొంజుబాబు


ఎంఈవోను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చెయ్యపేట: ఎంఈవోగా కె. బొంజుబాబు బాధ్యతలు స్వీకరించారు. చీడికాడ ఎంఈవోగా పని చేసిన ఆయన్ని ఇక్కడ నియమించడంతో శుక్రవారం విధుల్లో చేరారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు టి.వి. శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి అర్జున్ దేముడు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. శేషుకుమార్, సిహెచ్. మధుకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పి. అయ్యన్న, శ్రీనివాసరావు, రమణారావు, నారాయణరావు తదితరులు నూతన ఎంఈవోను అభినందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు

చోడవరం: సినీనటుడు మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఆయన అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం విశాఖ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ రవిశంకర్ పర్యవేక్షణలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చోడవరం మహేష్‌బాబు అభిమాన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఎంఈవో నాగేంద్ర

నర్సీపట్నం: వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటామని ఎంఈవో జి.నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్(మెయిన్)లో డెట్టాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్య ప్రణాళిక పరిశుభ్రత విద్యా కార్యక్రమాన్ని అమలు చేయడంలో ప్రతిభ కనబరిచిన పాఠశాలలు, ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు ఇస్తామన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం మధ్య అంతర్గత సంబంధం గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజంతోనే బలమైన దేశాన్ని నిర్మిస్తామన్నారు. హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు గడువు

మాకవరపాలెం: ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంఈవో మూర్తి శుక్రవారం తెలిపారు. పది ఫెయిలైన వారు మధ్యలో బడి మానేసిన వారు పదో తరగతిలో ప్రవేశాలకు అర్హులన్నారు. వయసు 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఇంటర్‌కు 15 ఏళ్లు నిండి, పదిలో ఉత్తీర్ణత సాధించి ఉన్నవారు అర్హులన్నారు.


కె.సంతపాలెంలో టమాటా పంట


దాలివలసలో టమాటాలను సేకరిస్తున్న సాగు రైతులు


కాలీఫ్లవర్ పంట

తెగనమ్ముకోవాల్సిందే..

- కోల్డ్ స్టోరేజీ లేక నష్టపోతున్న రైతులు
- కె.సంతపాలెం రైతు బజార్ వద్ద ఏర్పాటు చేస్తే మేలు
- 500 ఎకరాల్లో కూరగాయల సాగు

కె.కోటపాడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కకుండానే రైతులు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధర తక్కువగా ఉన్నప్పుడు నిల్వ చేసేందుకు కోల్డ్ స్టోరేజీ సదుపాయం లేక ఈ పరిస్థితి నెలకొంది. మండలంలో మెట్ట ప్రాంత గ్రామాల రైతులు కూరగాయలను కె.సంతపాలెం రైతు బజారులో విక్రయిస్తుంటారు. కె.సంతపాలెం, కె.కె.అగ్రహారం, చంద్రయ్యపేట, సూదివలస, పాతవలస, దాలివలస, ఆర్లి, బొట్టవానిపాలెం, కింతాడ, గవరపాలెం, పింద్రంగి, కె.జె.పురం గ్రామాల్లో 500 ఎకరాల్లో కూరగాయలు పండిస్తుంటారు. ఇదే ఆధారంగా ఆయా గ్రామాల రైతులు బతుకుతున్నారు.

కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలి

కె.సంతపాలెం రైతు బజార్ సమీపంలో ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న కూరగాయల పంటలకు మద్దతు ధర పొందాలంటే కోల్డ్ స్టోరేజీ ఉండాలి. మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నప్పుడు పంటను నిల్వ చేసేందుకు అవకాశం లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. రోజూ ఇక్కడ రైతు బజార్ ద్వారా రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు కూరగాయల అమ్మకాలు సాగుతున్నాయి.


అమ్మకానికి తీసుకువస్తున్న టమాటా

తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి...

రైతుల వద్ద పంటను కొనుగోలు చేసేందుకు విశాఖపట్నం, గాజువాక, కొత్తవలస, అనకాపల్లి ప్రాంతాల నుంచి వ్యాపారులు రోజూ వస్తుంటారు. రైతులు ఒక్కోసారి ఒకే రకమైన పంటను అమ్మకానికి తీసుకువచ్చిన సమయంలో మద్దతు ధర మాత్రం అంతంత మాత్రంగానే దక్కుతోంది. కూరగాయలకు పట్టణ మార్కెట్లో మంచి ధర ఉన్నా... ఇక్కడ తక్కువగా తెగనమ్ముకోవాల్సి వస్తోంది. పండించిన పంటను నిల్వ చేసి మరుసటి రోజు అమ్మకాలు చేసే పరిస్థితి లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

కోల్డ్ స్టోరేజీతో రైతులకు మేలు



కె.సంతపాలెం రైతు బజార్ వద్ద కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలి. పంటకు మద్దతు ధర లేనప్పుడు నిల్వ చేసేందుకు ఇక్కడ ఎటువంటి సదుపాయం లేదు. దీంతో సాగు ఖర్చులు ఎక్కువవుతున్నా..తప్పని పరిస్థితిలో అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పంటను మంచి ధరకు అమ్ముకోవాలంటే కోల్డ్ స్టోరేజీ ఉండాలి.
– ఆదిరెడ్డి రామునాయుడు, రైతు, దాలివలస

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


దేవరాపల్లి పీహెచ్‌సీలో గర్భిణులకు తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన


చౌడువాడలో గర్భిణులకు ఆరోగ్య సూచనలను ఇస్తున్న వైద్యాధికారి తరణి

దేవరాపల్లి: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. 34 మంది గర్భిణులను ఆమె పరీక్షించారు. రక్త, బీపీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి స్కానింగ్ నిమిత్తం కె.కోటపాడు ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తగినంత విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలతో తల్లీబిడ్డ క్షేమం

కె.కోటపాడు: గర్భిణులు అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులైన చిన్నారులకు జన్మనివ్వవచ్చునని వైద్యాధికారి తరణి తెలిపారు. శుక్రవారం చౌడువాడ పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 26 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వీరిలో 8 మందికి స్కానింగ్ పరీక్షల నిమిత్తం కె.కోటపాడు సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయించుకోవడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం క్షేమదాయకమని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కనకవేణి, హెల్త్ విజిటర్ అచ్చియ్యమ్మ, ఏఎన్‌ఎం సన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో ఫ్రైడే–డ్రైడే

కె.కోటపాడు: అపిడమిక్ సీజన్ కావడంతో ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. శుక్రవారం గుల్లేపల్లిలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఖాళీ రుబ్బురోళ్లు, కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నిల్వ నీటిని తొలగించడంపై ఆయన వివరించారు. మురుగునీటిలో లార్వాను విదల్చడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ వస్తుందన్నారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఖాళీ రుబ్బురోళ్లలో నిల్వనీటిని తొలగించుకోవడంపై సూచనలు చేస్తున్న రాజు

సాగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి

మాడుగుల రూరల్: సాగరం పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించామని సర్పంచ్ కోట్ని జయమ్మ సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం ఇక్కడ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ మేరకు వీధుల్లో చెత్తాచెదారాలను తొలగించడంతోపాటు డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, వార్డు మెంబర్ ఎన్నంశెట్టి లక్ష్మీ అప్పారావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి గర్హనీయం

బుచ్చెయ్యపేట: విజయవాడలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సీరా అర్జునరావు డిమాండ్ చేశారు. వడ్డాది ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, ఇంటి అప్పారావు, తురకలపూడి సర్పంచ్ గోవింద, కరక మాజీ సర్పంచ్ బి. రామకృష్ణ, దళిత సంఘ నాయకులు సీరా రవికుమార్, పి. అప్పారావు, గుడాల ఆనంద్, తోట అప్పారావు, టీకు నాగరాజులతో కలిసి శుక్రవారం బుచ్చెయ్యపేటలో నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై దాడి చేయడం హేయమైన చర్య అని, పోలీసులు, ప్రభుత్వం నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

చోడవరం: విజయవాడ స్వరాజ్ మైదానంలో గుర్తు తెలియని వ్యక్తులు 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై మాల మహానాడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ భవనం ఆవరణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపాయి. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించాయి. దేశ ప్రజల ఆశాజ్యోతి అంబేడ్కర్‌ను అగౌరపరిచిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సియాద్రి శ్రీనువాసరావు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు వేచలపు ప్రకాష్, మండల అధ్యక్షుడు గాడి నాగేశ్వరరావు, దళిత సంఘాల ప్రతినిధులు బూసి కోటి, కొత్తపల్లి శ్రీను, పొట్నూరు రాజారావు, మరియమ్మ పాల్గొన్నారు.


చోడవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల ప్రతినిధులు

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు. ఎం.కోడూరు దుర్గాదేవి ఆలయంలో పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పడాల అప్పలనాయుడు తదితరులు ఆలయం వద్ద భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

విధుల్లో చేరిన తహసీల్దార్లు


తహసీల్దార్ రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది


తహసీల్దార్ వరహాలుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ, ఆర్‌ఐ

నాతవరం: స్థానిక తహసీల్దార్‌గా ఎస్.ఎస్.వి శ్రీనివాస నాయుడు శుక్రవారం విధుల్లో చేరారు. సార్వత్రిక ఎన్నికలు ముందు ఫిబ్రవరిలో ఇక్కడ్నుంచి శ్రీకాకుళం జిల్లా పలాస తహసీల్దార్‌గా వెళ్లారు. ప్రస్తుతం ఆయన్ని తిరిగి నాతవరంలో నియమించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.సురేష్, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్‌ఐ హరి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నర్సీపట్నం తహసీల్దారుగా రవికుమార్...

నర్సీపట్నం: స్థానిక తహసీల్దారుగా బి.రవికుమార్ శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్ కార్యాలయ సిబ్బందిని తహసీల్దార్‌కు పరిచయం చేశారు.

చీడికాడ తహసీల్దార్‌గా బి.వి.రాణి

చీడికాడ: స్థానిక తహసీల్దార్‌గా బి.వి.రాణి శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఆమెను సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. అదే జిల్లా నుంచి ఇక్కడకు ప్రకాష్‌రావు వచ్చారు. ఇటీవల సొంత ప్రాంతానికి బదిలీపై వెళ్లిపోయిన ఆయన స్థానంలో రాణి విధుల్లో చేరారు.


తహసీల్దార్ శ్రీనివాసనాయుడు


చీడికాడ తహసీల్దారు రాణి

రోలుగుంట తహసీల్దార్‌గా వరహాలు

రోలుగుంట: తహసీల్దార్‌గా కైసర్ల వరహాలు శుక్రవారం విధుల్లో చేరారు. ఆయనకు డీటీ సోమశేఖర్, ఆర్.రామ్మూర్తి, సర్వేయర్ తవుటునాయుడు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల బదిలీపై శ్రీకాకుళం నుంచి వచ్చిన రవిచంద్ర తిరిగి తన జిల్లాకు వెళ్లిపోవడంతో వరహాలును ఇక్కడకు బదిలీ చేశారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు

రోలుగుంట: పాఠశాలల్లో పంద్రాగస్టు ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పలు ఆటల పోటీలను హెచ్‌ఎం శేఖర్ శుక్రవారం ప్రారంభించారు. పీడీ కొండలరావు పర్యవేక్షణలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 15వ తేదీ జెండా ఆవిష్కరణ అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.


బుచ్చింపేట పాఠశాల మైదానంలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి



తూటిపాలలో గిరిజన నృత్యం చేస్తున్న విద్యార్థులు


కొమరం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు, ప్రిన్సిపాల్


పెద శారాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు


ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా అల్లూరి వేషధారణ


కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

ధూమ్ ధామ్‌గా ఆదివాసీ దినోత్సవం

నర్సీపట్నం: గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. సంప్రదాయ థింసా నృత్యం, చిడతల కోలాటంతో వేడుకలను ధూమ్ ధామ్‌గా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మున్సిపల్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ వేడుకలకు ఆర్డీవో హెచ్‌వి.జయరాం ముఖ్య అతిథిగా హాజరై ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘానికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, నర్సీపట్నం శాఖ సంఘ అధ్యక్షుడు ఎస్.ధనార్జున్, జనరల్ సెక్రటరీలు ఎస్.ధర్మరాజు, జె.సింహాచలం, ఉపాధ్యక్షులు శ్రావణ్‌కుమార్, కె.లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షులు సోమయ్య, జి.పంతులుబాబు, కె.బాబు, ఎంఈవో చీడిపల్లి తలుపులు, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: మర్రిపాలెం గిరిజన మహిళా కళాశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆదివాసీ పోరాట యోధుడైన కొమరం భీమ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రెసిడెంట్ జి.గీతాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గీతాకృష్ణ మాట్లాడుతూ దేశ జనాభాలో తొమ్మిది శాతం ఉన్న ఆదివాసీల జీవన విధానం, సంస్కృతిని అందరికీ తెలియజేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో బస్సు, రహదారి, కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డోలీ మోతలతో జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి కనీస సదుపాయాలు కల్పించటంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. డీవైఎఫ్‌ఐ నాయకులు గౌతమ్, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ ప్రెసిడెంట్ జనార్దన్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల/ రూరల్: అవురువాడ పంచాయతీ పెద శారాడ గ్రామంలో ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు ఇ.నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి జెండా ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు ఇ.భవాని మాట్లాడుతూ నాన్ షెడ్యూల్‌లో గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. అప్పుడే నిజమైన ఆదివాసీ దినోత్సవమన్నారు. అంపరంగి శ్రీను, సురేష్, చెదల మల్లిబాబు, భీమేసులమ్మ, జనుమూరి ఈశ్వరరావు తదితర గిరిజన గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గిరిజన సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం హెచ్‌ఎం కె.రాము మాట్లాడుతూ గిరిజనుల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, వారి జీవన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఆదివాసీ జీవన విధానాన్ని తెలియజేసేందుకే ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు లోవరాజు, నారాయణరావు పాల్గొన్నారు.

సొసైటీకి సభ్య రైతుల వివరాలు

దేవరాపల్లి/మాడుగుల రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) లావాదేవీలను కంప్యూటరీకరణ చేస్తున్నందున సభ్య రైతులంతా తమ వివరాలను అందించాలని దేవరాపల్లి మండలం కలిగొట్ల సంఘ సీఈవో ఆర్. వెంకటరావు, మాడుగుల మండలం ఎం.కోడూరు సంఘ పర్సన్ ఇన్‌చార్జి వి.వి ప్రదీప్‌కుమార్, సీఈవో బంటు రామునాయుడు, వీరవిల్లి అగ్రహారం సంఘ సీఈవో బలిరెడ్డి అప్పలరాజు వేర్వేరు ప్రకటనల్లో శుక్రవారం తెలిపారు. సొసైటీ సభ్య రైతులంతా తమ భూమి పట్టాదారు పాసు పుస్తకం, వన్‌బీ, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, రెండు పాస్ సైజు ఫొటోలతో పాటు ఫోన్ నంబర్, నామినీ ఆధార్ కార్డును తదితర వివరాలను అందించాలన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

- దేవరాపల్లి ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో దేవరాపల్లిలో చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో తదితర వివరాలను తెలిపి అధికారులకు సహకరించాలని సూచించారు. పంటల నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు అర్హత పొందుతారన్నారు. మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. కౌలు రైతులు సైతం పంటల నమోదు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి భాగ్య పాల్గొన్నారు.


దేవరాపల్లిలో పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న అధికారులు

మాడుగుల రూరల్: మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాల వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మూలంనాయుడు తెలిపారు. జాలంపల్లి పంచాయతీ శివారు రాయిపాలెం, సిరిపురం, పిట్టగెడ్డ గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీని శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, లార్వా వ్యాప్తి చెందకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ అల్లూరి సీతారామరాజు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.